
ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 03 సంచిక -145 పేజీలు - 04 వెల - 04/- గురువారం 2 జులై 2026



# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

**ముందు దేశానికి..**

**ఆ తర్వాత తల్లిదండ్రులకు..**

**ఆర్మీ చీఫ్ ఎమోషనల్ మూమెంట్**

**31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ ధీరజ్ సేథ్**

**మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రికి సెల్యూట్**

**అనంతరం తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఆర్మీ చీఫ్**

**ఈ భావోద్వేగ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్**

భారత సైన్యం 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్ తొలి రోజే అందరినీ కదిలించే భావోద్వేగ క్షణానికి కారణమయ్యారు.

మిగతా 2లో.



# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపి

**తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన**

**అందుబాటులో నైపుణ్యం కలిగిన మానవ వనరులు**

**హీరో సంస్థ ఏపికి రావడానికి ప్రత్యేక కృషి చేశా**

**సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

**తిరుపతి,జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హీరో సంస్థ తిరుపతికి రావడానికి తాను ప్రత్యేకంగా కృషి చేశానని, మరో రాష్ట్రానికి వెళ్లాల్సిన సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్త తరం బ్యాటరీ ఆధారిత వాహనాల తయారీ కూడా తిరుపతిలోని హీరో ఎ÷–లాంట్‌లోనే జరగనుందని వెల్లడించారు. ఆంధప్రదేశ్ యువత ప్రతిభావంతులని, ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకునే సామర్థ్యం వారికి ఉందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యధికంగా ఇంజినీరింగ్ చదువుకున్న

మిగతా 2లో.




# 'మావిగన్ వర్సెస్ అమరావతి'..



**వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'..**

**చూసుకుందాం: జగన్**

**మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య**

**ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ**

**అమరావతి జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు

మిగతా 2లో.



# నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు

**రాష్ట్రాభివృద్ధి, తెలుగువారిని అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం: చంద్రబాబునాయుడు**

**పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శమన్న ముఖ్యమంత్రి**

**సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు అని ఆగ్రహం**

**మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు చేస్తున్నారన్న సీఎం**

# ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

**ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన నారా లోకేశ్**

**ఇంజినీరింగ్ విభాగంలో 70.52 శాతం విద్యార్థులు క్వాలిఫై**

**అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 89.59 శాతం ఉత్తీర్ణత**



**అమరావతి జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఫలితాలను విడుదల చేశారు.

మిగతా 2లో.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు**

**ఆర్థిక శాఖ ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ**

**ఇకపై 25లోగా జీతాల బిల్లులు సమర్పించాలని ఆదేశాలు**

**ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం**

**హైదరాబాద్‌జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల ఒకటో తేదీనే వారి జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న

మిగతా 2లో.




# పాలనపై చర్చకు సిద్ధం..

**దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పు**

**సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ప్రతిసవాల్**

**ప్రభుత్వ వైఫల్యాలు నిరూపించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

**అబద్ధాలు ఆపి (ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు**




**హైదరాబాద్‌జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ఏ అంశంపైనైనా ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిసవాల్ విసిరారు. వరంగల్, హైదరాబాద్‌లో

మిగతా 2లో.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకెళ్లాలి -కేంద్రీయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పిలుపు**

**అనంతపురం జులై 01,ఆంధ్ర ప్రగతి**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురములో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ , రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ , రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా.శంకరఆచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి, తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో.




# హద్దుమీరితే ఆటకట్టిస్తాం

**సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!**

**వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక**

**ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం**

**సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు**

**ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు**

**అమరావతి జూలై, 1,ఆంధ్ర ప్రగతి**

సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు.మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు.

మిగతా 2లో.



# 'మావిగన్ వర్సెస్ అమరావతి'..

**మొదటిపేజీ తరువాయి**

అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

### బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?: జగన్

"కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది" అంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తే, రేపు సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని కూటమి సర్కార్‌ను నిలదీశారు.
ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం, చివరకు లాకప్ డెత్‌లకు పాల్పడటం వంటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం... కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి

**మొదటిపేజీ తరువాయి**

విద్యార్థులు ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాలు, పోర్టులు, రోడ్లు, రైల్వే అనుసంధానం, విద్యుత్, నీటి వనరులు పరిశ్రమలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. త్వరలో దుగ్గరాజుపట్నం పోర్టు, నాలుగు లైన్ల రైల్వే మార్గాలు అందుబాటులోకి రావడంతో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యమని, ఇప్పటికే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు. వీటి ద్వారా సుమారు 10 లక్షల ఉద్యోగాలు సృష్టించే
అవకాశం ఉందన్నారు. ఒకసారి ఎంఓయూ కుదిరిన తర్వాత ఆ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్‌ను 2028 డిసెంబర్‌లోగా ప్రారంభించేలా చర్యలు కొనసాగుతున్నాయని, అమరావతిలో వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటింగ్ తయారీకి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. హీరో సంస్థ మహిళా పోలీసులకు 63 వాహనాలను అందించడం అభినందనీయ మని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే 'పీ4' కార్యక్రమంలో హీరో సంస్థ భాగస్వామ్యం కావడాన్ని స్వాగతిస్తూ, పరిశ్రమ ఉన్న ప్రాంతంలో సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక సీఈవోను నియమించాలని సూచించారు. మానవ వనరుల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి కీలకమని, లక్షలాది మంది యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు

"పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఈ సమయంలోనే ఇథనాల్ వినియోగించుకుని ఇంధన పొదుపు చేయాల్సి ఉంది. ఇథనాల్ తయారీ కోసం మొక్కజొన్న లాంటి పంటలు అవసరం అవుతాయి. రైతులు ఈ ప్రత్యామ్నాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమల్ని ఆహ్వానించడానికి సమయం పడుతుంది. కానీ తరిమి కొట్టడానికి ఒక్క క్షణం చాలు. గత పాలకులు పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టారు. కర్ణాటకకు వెళ్లిపోవాల్సిన హీరో మోటార్స్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేసేలా కృషి చేశాం. కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు కూడా 3వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నాం. 2028 నాటికి ఆ రాయలసీమలో స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి కూడా ప్రారంభిస్తుంది. నా ప్రయత్నం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించటమే. గొడ్డలి పార్టీ తీవ్రవాదుల తరహాలో అందరినీ భయాందోళనలకు గురి చేస్తోంది.
రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో గొడ్డలి పార్టీ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా నియంత్రించాం. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీకి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు" అని మండిపడ్డారు.

#### హోంమంత్రిపై అవమానర వ్యాఖ్యలు

"విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సీఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో ఆ పార్టీ నేతలు రెచ్చి పోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్ పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం.
మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు. నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీ, నేరస్తులతో రాజకీయాలు చేసే పార్టీని ఇప్పుడే చూస్తున్నాం. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయి. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే ఒక్క నిముషం పని కానీ మేం ప్రతీ కార రాజకీయాలు చేయటం లేదు. మా దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని అందలం ఎక్కించాలనే. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అనే సంకల్పం ప్రజలు చేయాలని కోరుతున్నాను. 'ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్' అన్నదే మన నినాదం కావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేరస్తులకు వంతపాడటం, నేరాలు చేయటం రాజకీయ పార్టీలకు తగదు. ఇలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

#### డ్వాక్రా మహిళలకు అభినందన

అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను ముఖ్యమంత్రి తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ఆయనకు అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన ముఖ్యమంత్రి డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక దినం మాత్రమే కాదని, ఈ యువ సంస్థ ప్రస్థానంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అని అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సంస్థగా మారడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పట్ల, ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన లక్ష్యాల పట్ల దీనికున్న నిబద్ధత, సమ్మిళిత, సమానత్వ అభివృద్ధి పట్ల బాధ్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఒక శ్రేష్ఠతా కేంద్రంగా ఆవిర్భవించి, 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత సాకారానికి గణనీయంగా దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

#### సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవం వారి సంవత్సరాల అంకితభావం, పట్టుదల మరియు కఠోర శ్రమకు పరాకాష్ట అని అన్నారు. వారు కలలతో విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు, మరియు ఈ రోజు వారు జ్ఞానం, ఆత్మవిశ్వాసం మరియు వారికి కొత్త అవకాశాల తలుపులు తెరిచే డిగ్రీతో బయటకు వెళు
తున్నారు. విద్యార్థుల విజయం వారి సొంత కఠోర శ్రమ ఫలితమే అయినప్పటికీ, అది వారి తల్లిదండ్రుల త్యాగాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమాజ మద్దతుతో కూడా రూపుదిద్దుకుందని రాష్ట్రపతి అన్నారు. అందువల్ల, సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. వారు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణలను నడిపించే శాస్త్రవేత్తలుగా, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా సమాజ సేవ చేసే దాతలుగా మారినా, వారి విద్య అణగారిన వర్గాలకు బలంగా




మారాలి. సాంకేతిక పురోగతులు ప్రతి రంగాన్ని మారుస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇంత వేగంగా మారుతున్న ప్రపంచంలో, డిగ్రీ సంపాదించడంతో చదువు ముగిసిపోకూడదు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు నిరంతరం అనుగుణంగా మారే తపన విద్యార్థులకు గొప్ప బలాలలో ఒకటిగా ఉంటుంది. కొత్త ఆలోచనలను అన్వేషించడానికి, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి ధైర్యాన్ని పెంపొందించు కోవాలని ఆమె వారికి సూచించారు. నేర్చుకోవాలనే తపన, పట్టుదల, నూతన ఆవిష్కరణలు చేసే మన యువత మన అమూల్యమైన జాతీయ సంపద అని రాష్ట్రపతి అన్నారు. తమ జ్ఞానాన్ని సృజనాత్మకత, పట్టుదల, బాధ్యతా భావంతో మేళవించడం ద్వారా, మన యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, మరింత సమ్మిళిత, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడగలరు. నైతిక విలువలను అలవర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్రపతి చెప్పారు. నిజాయితీ, కరుణ, సానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం అనేవి కేవలం ఉన్నతమైన నైతిక ఆదర్శాలు మాత్రమే కాదని, అవి సంపూర్ణ అభివృద్ధికి పునాదులని ఆమె అన్నారు. ఈ గుణాలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, సమాజానికి, దేశానికి అర్థవంతంగా తోడ్పడటానికి వీలు కల్పిస్తాయి. మన యువత యొక్క శక్తి, ప్రతిభ, నిబద్ధత ద్వారా మాత్రమే వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోగలమని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అంకితభావంతో, నిజాయితీతో శ్రేష్ఠతను సాధించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డ్ మెడల్ సాధించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గోల్డ్ మెడల్ లను గౌరవ భారత రాష్ట్రపతి బహూకరించారు. అంతకుముందు గౌరవ భారత రాష్ట్రపతి గారిని, రాష్ట్ర గవర్నర్ గారిని, మంత్రి నారా లోకేశ్ గారిని, మంత్రి పయ్యావుల కేశవ్ గారిని ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,76,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా... వారిలో 2,58,545 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,82,317 మంది (70.52 శాతం) విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. అలాగే, అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 79,231 మంది దరఖాస్తు చేసుకోగా... 70,929 మంది పరీక్ష రాశారు. ఈ విభాగంలో ఏకంగా 63,546 మంది అంటే 89.59 శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయి మంచి ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎప్‌సెట్ పరీక్షల్లో టాప్ ర్యాంకర్లు వీరే:

ఇంజినీరింగ్:
జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి – గుంటూరు
కోరుకొండ శ్రావ్య – శ్రీకాకుళం
వెన్న ప్రవీణ్ కుమార్ రెడ్డి – పల్నాడు
తుంగ దుర్గా సుప్రభాత్ – పల్నాడు
తెల్లూరి శ్రేయస్ రెడ్డి – హైదరాబాద్
ముక్కార సాకేత్ – కడప
బండి వెంకట సాత్విక్ – గుంటూరు
నూర్ బాషా హఫీజ్ – గుంటూరు
పసల మోహిత్ – కడప
మరక వంశీధర్ రెడ్డి – కడప.

అగ్రికల్చర్ అండ్ ఫార్మా:
శంబంగి జశ్వంత్ నాయుడు – విజయనగరం
కుడుముల వెంకట మహంత్ అక్షజ్ రెడ్డి – మేడ్చల్ మల్కాజ్‌గిరి
కొండ్రెడ్డి హారికాదేవి శ్రీ అనూహ్య – కృష్ణా
కర్రి సత్యనారాయణ – కాకినాడ
బంటు ధాత్రిక – అనకాపల్లి
పల్లికొండ దర్శ్‌తేజ – కాకినాడ
వల్లెపు ధీరజ్ కృష్ణ – గుంటూరు
దండమూడి జాగృతి – గుంటూరు
ఆళ్ల శ్రీలక్ష్మి సత్యసాయి నిఖితారెడ్డి – పల్నాడు
రేలంగి జయ షణ్ముఖి – విజయనగరం.

# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

**'మొదటిపేజీ తరువాయి**

గార్డ్ ఆఫ్ ఆనర్' స్వీకరించిన అనంతరం ఆయన నేరుగా తన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రి కె.ఎం.సేథ్‌కు సైనిక సెల్యూట్ చేశారు. అంతటితో ఆగకుండా తల్లి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. మరో విశేషం ఏంటంటే.. భారత నౌకాదళంలో రియర్ అడ్మిరల్‌గా ఉన్న ఆయన సోదరుడు రవ్నీష్ సేథ్ కూడా కొత్త ఆర్మీ చీఫ్‌కు సెల్యూట్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
అంతకుముందు జనరల్ ధీరజ్ సేథ్ జాతీయ యుద్ధ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం అధికారికంగా ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. దేశ భద్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

# హద్దుమీరితే ఆటకట్టిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు.
సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.'నేరస్థులకు, నేరానికి కులం, మతం, రాజకీయ పార్టీలు ఉండవు. తప్పు చేసి...కులం, మతం, ప్రాంతం, రాజకీయాల వెనక దాక్కోలేరు. చట్టం ముందు ప్రతి పౌరుడూ సమానమే. నేరం చేసిన ప్రతి ఒక్కరిపైనా చట్ట ప్రకారం చర్యలుంటాయి. సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ పోరాటంలో వారు ఒంటరులు కాదు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో దీనిపై ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. స్క్రీన్ షాట్స్, లింక్స్, వీడియోలు లేదా ఏదైనా డిజిటల్ ఆధారాలతో బాధితులు అక్కడ ఫిర్యాదు చేయవచ్చు. అవసరమైతే సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త చట్టం తెస్తాం" అని ఆయన తెలిపారు.

# పాలనపై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ, బోధి పెవిలియన్, ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ చౌరస్తా ఎక్కడికైనా తానే స్వయంగా వస్తానని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపైనా, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాలతో సహా నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడీ వల్లే తెలంగాణ దివాలా తీస్తున్నదని విమర్శించారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదంటున్న రేవంత్ రెడ్డి, 72 సార్లు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు.
కేసీఆర్ హయాంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి నిత్యం అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2023 వరకు తెలంగాణ అప్పు రూ.3.50 లక్షల కోట్లని పార్లమెంటులో కేంద్రం చెప్పిందన్నారు. ఇందులో ఉమ్మడి రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు, కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.2.78 లక్షల కోట్లని వివరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ. 8.11 లక్షల కోట్లు అప్పు చేశారంటూ నిత్యం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అప్పులే కాకుండా రాష్ట్ర ఆదాయంతోపాటు అప్పులకు కడుతున్న వడ్డీ లెక్కలపైనా సీఎం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చెప్పింది నమ్మాలా?, కాగ్ చెప్పింది నమ్మాలా?అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికే రూ.1.13 లక్షల కోట్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు చెప్పిన ఆర్థిక సహాయం చేయలేదన్నారు. రైతాంగానికి బాకీ పడ్డ రూ.1.13 లక్షల కోట్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎకరానికీ రైతుభరోసా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రైతాంగానికి, విద్యార్థులకు, మహిళలకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు.
ఆ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. డబ్బుల్లేవంటూనే రూ.200 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించుకున్నారని అన్నారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధాలు మాట్లాడ్డం ఆపి ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిపెట్టాలని హితవు పలికారు. రాష్ట్రం గురించి అడ్డగోలుగా మాట్లాడి ప్రజల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని కోరారు. రానున్న రోజుల్లో బాహుబలి సినిమాలో భల్లాల దేవునికి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. ఆయన నమ్మిన హిట్లర్‌కి ఎలాంటి ముగింపు కలిగిందో అలాంటి ముగింపునే ప్రజలు రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇస్తారని అన్నారు. ఆయన అభద్రతాభావంలో ఉన్నారని చెప్పారు. రూ.15 లక్షలు ఇస్తానని మోడీ, రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. కృష్ణా, గోదావరి జలాలను గురుదక్షిణ కింద చంద్రబాబుకు అప్పగించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 280 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రభుత్వం మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, విప్ కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ రాకేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**మొదటిపేజీ తరువాయి**

సిబ్బందికి వేతనాలు జమయ్యాయి. గతంలో జీతాల చెల్లింపులో ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆర్థిక శాఖ జీతాల చెల్లింపును పూర్తి చేసింది. ఇకపై ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు పంపాలని, నెలలో చవరి పని దినానికల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసిన తాటికొండ బుగ్గ రాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** నంద్యాల టౌన్ వైయస్సార్ నగర్ 38వ వార్డు నందు రాష్ట్ర మంత్రి ఎన్ఎండి .ఫరూక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఆదేశాల మేరకు సచివాల సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ చేసిన 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు ఎస్వివై రెడ్డి స్మార్ట్ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ పంపిణీ చేస్తున్న తాటికొండ బుగ్గ రాముడు నంద్యాల టౌన్ వైయస్సార్ నగర్ 38వ వార్డు నందు మంత్రి ఫరూక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఆదేశాల మేరకు సచివాల సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ చేసిన 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు ఎస్వీవై రెడ్డి స్మార్ట్ సిటీ నాయకులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు సిటీ నాయకులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు ఘన సన్మానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 01:** అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నంద్యాలలోని శ్రీకర్ హాస్పిటల్ డాక్టర్ విజయబాబు, శాంతిరాం ఐ డాక్టర్ సంజీవ కుమార్, ఆర్.ఎం.పి జావిద్, సలీంనగర్ హర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ కాంతారావు, నూనెపల్లె డాక్టర్ సాయి కృష్ణ వీరిని శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేసి అంతర్జాతీయ డాక్టర్స్ డే ఘనంగా జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య మాట్లాడుతూ దేవునితో సమానమని తెలియజేశారు నేడు సమాజంలో డాక్టర్లు ఎంతగానో పేద ప్రజలకు సేవ చేస్తూ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ ప్రజలను కాపాడుకున్నారు... కరోనా టైంలో డాక్టర్లు వారి స్టాఫ్ చేసే సేవ చాలా గొప్పదని డాక్టర్లు వారి స్టాప్ వారి ప్రాణాలను అడ్డుపెట్టి ప్రజల ప్రాణాలను కాపాడారు అని డాక్టర్లు 24 గంటలు సర్వీస్ చేస్తూ పేద ప్రజలకు అప్పుడప్పుడు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చింతలయ్య తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు పబ్బతి అబ్రహం, చాబోలు సలాం హమీద్, సీనియర్ నేతలు ఉకోటు వాసు ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా కమిటీ ఏర్పాటు.

**-గౌరవ సలహాదారుగా నంద్యాల మార్కెట్ ప్రసాద్ ఎంపిక.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పత్తికొండ బాలాజీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా వెంకటరాముడు, గౌరవ సలహాదారుగా నంద్యాల మార్కెట్ ప్రసాద్ (లక్కబోయిన ప్రసాద్)ను నియమించారు. జిల్లా కన్వీనర్‌గా తెలుగు వెంకటలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంకరి రాజు, రాష్ట్ర కార్యదర్శిగా అనగల శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పుట్టా శివ, రాష్ట్ర కన్వీనర్‌గా తెలుగు అరుణకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలిగా తెలుగు సరస్వతి, జిల్లా కార్యదర్శులుగా దస్తపురి వెంకటలక్ష్మి, శీలం రవి, జిల్లా ఖజాంచీగా రమేష్ కుమార్, జాయింట్ ఖజాంచీగా పత్తికొండ ధనలక్ష్మిలను నియమించారు.కార్యవర్గ సభ్యులుగా దస్తపురి వెంకటరమణ, తెలుగు శ్రీనివాసులుతో పాటు పలువురిని ఎంపిక చేశారు. నూతన కమిటీ మత్స్యకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సామాజికఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎన్ఎండి ఫిరోజ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో నందు 22,13,716 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, ,వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు మంత్రి ఫరూక్ కి విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 22 మంది బాధిత కుటుంబ సభ్యులకు వచ్చిన 22 లక్షల 13 వేల 716 రూపాయలను చెక్కుల రూపంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అతి కొద్ది కాలంలోనే 3 కోట్ల 52 లక్షల రూపాయలను 477 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని ఫిరోజ్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దస్తగిరి , సురేష్ కుమార్, మూలమట్టం చైర్మన్ పసుపులేటి నారాయణ, గోవింద నాయుడు, మండ్ల గుర్రప్ప, పెద్ద కొట్టాల రాజేష్, జాకీర్, ఓబుల్ రెడ్డి, వీర సింహారెడ్డి, చెన్నయ్య మరియు వార్డు ఇన్చార్జిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం పోసే వైద్యుడే దేవుడు : డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి.

**-గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్లో వైద్యుల దినోత్సవ వేడుకలు.**







**ఆంధ్ర ప్రగతి గోస్పాడు/ బాబా నగర్ జులై 01:** నంద్యాల జిల్లా బాబా నగర్ గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గురు రాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన వైద్య దినోత్సవ వేడుకలు గురు రాజ ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ వైద్యులు ప్రాణాలను నిలిపి దేవుళ్ళని గుర్తు చేశారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైన తెలిపారు. ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడే శక్తి డాక్టర్లకే ఉంటుందని చెప్పారు. వైద్యుల సేవలు ఎన్నటికీ మరువరాదని అన్నారు. కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఎంతోమందిని కాపాడాలని అలాంటి వారిని దేవుళ్ళుగా పూజించాలని తెలిపారు. వైద్య గుర్తుంచుకున్న ప్రతి ఒక్క విద్యార్థి దేవునితో సమానంగా భావించాలని వారు చేసే ప్రతి వైద్యం ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం వివిధ రంగాల సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. అనంతరం పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ.. వైద్యులు అంటే ప్రాణాలు కాపాడే దేవుళ్ళు అని తెలిపారు. వైద్య వృత్తిని ఎంచుకున్న ప్రతి ఒక్కరూ దేవునితో సమానమని కొనియాడారు. వారు చేసే సామాజిక కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని చెప్పారు. అనంతరం వివిధ రకాల వైద్య సేవలు అందించిన వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పూర్తి నింపేలా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

# వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం.

**.నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుమల పునీత్ ఆసుపత్రి.**

**..జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరం ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**..నంద్యాల వైద్యుల సేవలు అభినందనీయం: జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్.**

**..వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజల సేవ కోసం పునరంకితం కావాలి: డాక్టర్ రవి కృష్ణ.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి రాయి జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మరియు నంద్యాల ప్రథమ ఈఎన్టీ వైద్యులు దివంగత డాక్టర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ సహకారంతో తిరుమల పునీత్ ఈ ఎన్ టి మరియు స్కిన్ ఆసుపత్రి నిర్వహణలో, రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు పి 4 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ డాక్టర్ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల వైద్యులు వైద్య శిబిరాలునిర్వహిస్తూ,దివ్యాంగులకు, దేశ రక్షణలో పనిచేస్తున్న త్రివిధ దళాల ఉద్యోగుల కుటుంబాలకు ఉచిత ఓ పి డి సేవలు అందిస్తూ రాష్ట్రంలోని వైద్యులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు.

ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వైద్య సేవలే కాకుండా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో వైద్యులు ముందు ఉండడం ప్రశంసనీయమన్నారు. వైద్యుల దినోత్సవం వేడుకలలో భాగంగా ఫిరోజ్ కేక్ కట్ చేసి వైద్యులకు అందించారు.

ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులందరూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుమల పునీత్ ఈఎన్టి స్కిన్ ఆసుపత్రి తరపున డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ విజయబాబు, నంద్యాల మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, వెలాసిటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ లకు వైద్యుల దినోత్సవ పురస్కారాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందించి సత్కరించారు.

వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యురాలైన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష




కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ నాగమణి,డాక్టర్ నర్మద, డాక్టర్ లలిత, ప్రజలు పాల్గొన్నారు.

**విజయవంతమైన వైద్య శిబిరం:**

ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్,ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ హరిత దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా లక్ష రూపాయలు విలువచేసే మందులు పంపిణీ చేశారు.

70 మందికి అవసరమైన వినికిడి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించడం జరిగింది.

# ఘనంగా జాతీయ చార్టెడ్ అకౌంటెంట్ దినోత్సవం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** జాతీయ చార్టెడ్ అకౌంటెంట్ డే సందర్భంగా శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ విద్యార్థిని/విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సభాధ్యక్షులుగా కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నంద్యాల చార్టెడ్ అకౌంటెంట్ పాలూరు గోపికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చార్టెడ్ అకౌంటెంట్ పైన కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ తమ ప్రసంగంలో గోపికృష్ణ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగములో కామర్స్ విభాగం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది, చార్టెడ్ అకౌంటెంట్ వంటి అంశాలు మనకు అవగాహన కలిగి ఉంటే జనరల్ మేనేజ్మెంట్ తో పాటు వ్యాపారం తదితర అంశాలలో చార్టెడ్ అకౌంటెంట్ ప్రాధాన్యత ఎంతో ఉంది, ఈ మధ్యకాలంలో జీఎస్టీ అనేది వింటూ ఉన్నాము జీఎస్టీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి జిఎస్టిని వసూలు చేయడం వలన రాష్ట్రాలు, దేశము ఎంతో అభివృద్ధి చెందుతూ ఉన్నాయి, కాబట్టి కళాశాల విద్యార్థులు డిగ్రీ తర్వాత సిఏ చదవటానికి ఆసక్తిని చూపించాలి అందరూ చాలా కష్టం అనుకుంటారు కానీ కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అని




అవగాహన కలిగిస్తూ విద్యార్థులు అడిగిన అనేక సందేహాలకు నివృత్తి చేస్తూ తమ ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో కామర్స్ విభాగం చాలా ప్రాధాన్యత ఉన్న విభాగమని ప్రతి సంవత్సరము 300 పైన విద్యార్థులు కామర్స్ విభాగంలో చేరుతున్నారని కాబట్టి స్టూడెంట్స్ కు, సమాజానికి, దేశానికి ఎంతో ఉపయోగపడే సబ్జెక్టు కామర్స్ అని చెప్పారు, ఇట్లాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు కలిగించాలనే ఉద్దేశంతో ఈరోజు చార్టెడ్ అకౌంటెంట్ డే ను జరుపుతూ ఉన్నామని ఇప్పుడు జాతీయ విద్యా విధానంలో అనేక మార్పులు వచ్చాయని విద్యార్థులు అది గ్రహించాలని అన్నారు, మనకు వేదాలలో అన్ని శాస్త్రాలతో పాటు కామర్స్ శాస్త్రాలు సమాచారం కూడా ఉంది అని చెప్పారు కౌటిల్యుని అర్థశాస్త్రం వాడికి అంశాలు రాజుల కాలంలో ధనాగారం కోషాగారం ఇందుకు నిదర్శనం అని అన్నారు. వీటిని నిజమైన తదితరు అంశాలు ప్రాచీన భారతీయ సంస్కృతిలో రాజ్య పాలనలో కోశాగారము ఎలా నిర్వహించాలి అనే అంశాలు ఎంతో శాస్త్రీయంగా ఉన్నాయని నేడు కామర్స్ వాటి నుండి వచ్చిందని తెలియజేశారు. కాబట్టి విద్యార్థులు డిగ్రీ తర్వాత సిఏ వంటి కోర్సులు చదివి ఉన్నతమైన స్థానంలోకి రావాలని తమ కళాశాల పూర్వ విద్యార్థి పాలూరు గోపికృష్ణ ఈరోజు నంద్యాల పట్టణంలో గొప్ప చార్టెడ్ అకౌంటెంట్గా ఉంటూ మంచి ఆదరణ పొందుతూ ఉన్నత స్థానంలో ఉన్నారని ఇది తమకు సంతోషాన్ని కలిగిస్తుందని అలాగే విద్యార్థులైన మీరు ఉన్నతమైన చదువులు చదివి గొప్పగా ఎదగాలని మీరు కూడా ఇలాగా ముఖ్య అతిథులుగా కళాశాలకు రావాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కేబీవి సుబ్బయ్య మాట్లాడుతూ కామర్స్ విభాగం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు అవగాహన ఏర్పరచుకొని స్ఫూర్తిని పొందాలని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి అయిన పాలూరు గోపికృష్ణను కళాశాల యాజమాన్యం కామర్స్ విభాగం వారు శాలువా మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ డి.పుల్లయ్య, సత్యనారాయణ, మస్తాన్, శేఖర్, మద్దిలేటి, బాలచంద్రుడు, డాక్టర్ లలితా సరస్వతి మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు, జాతీయ గీతంతో కార్యక్రమము ముగిసింది.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక కార్పొరేట్ వైద్యం లక్ష్యం.

**నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రిటికల్ కేర్ వైద్యం అందుబాటులోకి తెస్తాం.**

**వైద్య వృత్తి దైవంతో సమానం. -ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం వైద్యం కోసం అధిక నిధులు వెచ్చించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం కూడా వైద్య సేవలకు నిధుల కొరత లేకుండా చూస్తుందని, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అత్యవసర, క్రిటికల్ కేర్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నంద్యాల జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో ఆధునిక పరికరాల ప్రారంభం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి ఒక్క ఆధునిక పరికరం ఇవ్వలేదని, నిర్లక్ష్యంకు గురైందని, వెనుకబడ్డ ఆసుపత్రికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎక్కువ నిధులు తెచ్చి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్నాం అన్నారు. నంద్యాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో , గెయిల్ ఇండియా లిమిటెడ్, నిధులు, నంద్యాల ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో మిత్ర సంస్థ సహకారంతో నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అత్యాధునిక వైద్య పరికరాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ గానే, కాకుండా ఒక డాక్టర్ గా నా జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. డాక్టర్లు కూడా కుటుంబాలను త్యాగం చేసి రోగికి మంచి వైద్యం అందించి క్లిష్ట సమయంలో కూడా రోగిని బ్రతికించేందుకే శ్రమిస్తారన్నారు. ఎక్కడైనా చిన్న పొరపాటు జరిగితే డాక్టర్ నిర్లక్ష్యం అని దాడులు చేయడం సరికాదన్నారు. వైద్య వృత్తి దైవంతో సమానం అన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భారీ కేక్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కట్ చేశారు. భారత రత్న డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ (డాక్టర్ బి సి రాయ్ ) జయంతి, వర్ధంతిని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ప్రతి డాక్టర్ అంకిత భావంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ జిలాని, డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ చిట్టిబాబు, గైనకాలజిస్టు హెచ్ ఓ డి డాక్టర్. పద్మజా, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ క్రిస్టోఫర్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద రోగులకు ఉచిత వైద్యం అదృష్టంగా భావిద్దాం.

## ..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జులై 01:**
నంద్యాల వైద్యుల ఉచిత వైద్య సేవలు అభినందనీయమని, పేద రోగులకు ఉచిత వైద్యం అందించడం అదృష్టంగా భావిద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల ప్రధమ ఈఎన్టీ వైద్యులు దివంగత డాక్టర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ సహకారంతో తిరుమల పునీత్ ఈ ఎన్ టి, స్కిన్ ఆసుపత్రి నిర్వహణలో, రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు పి 4 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ ఉచిత వైద్య శిభిరంకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు ప్రతి నెల ఒక రోజు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, దివ్యాంగులకు, దేశ రక్షణలో పనిచేస్తున్న త్రివిధ దళాల ఉద్యోగుల కుటుంబాలకు ఉచిత ఓ పి డి సేవలు అందిస్తూ రాష్ట్రంలోని వైద్యులకు ఆదర్శప్రాయంగా





నిలిచారని అభినందించారు.

ఈ సందర్భంగా తిరుమల పునీత్ ఈఎన్టి స్కిన్ ఆసుపత్రి తరపున డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ విజయబాబు, నంద్యాల మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, వెలాసిటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాథ్ రెడ్డి లకు వైద్యుల దినోత్సవ పురస్కారాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిచే సత్కరించారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యురాలైన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్, డాక్టర్, జి. రవికృష్ణ, రోటరీ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ నాగమణి,డాక్టర్ నర్మద, డాక్టర్ లలిత, ప్రజలు పాల్గొన్నారు.

**విజయవంతమైన వైద్య శిబిరం**

ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్,ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ హరిత దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా లక్ష రూపాయలు విలువచేసే మందులు పంపిణీ చేశారు.

70 మందికి అవసరమైన వినికిడి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించడం జరిగింది.

# నంది అవార్డు గ్రహీతకు సన్మానం.

**ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 01:**



మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రముఖ చెక్కభజన కళాకారుడు పొట్టివాండ్ల విజయభాస్కర్ హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక కార్యక్రమంలో నంది అవార్డు అందుకున్నారు. నంది అవార్డు పొందిన పొట్టివాండ్ల విజయభాస్కర్ ని ఎస్సీ కాలనీ ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విజయ్ భాస్కర్ నంది అవార్డు అందుకోవడం హర్షనీయమన్నారు. ఉన్నత స్థానానికి ఎదిగిన మన జాతి బిడ్డలను గౌరవించుకోవడం మన ధర్మం అని అన్నారు. తన ప్రతిభను గుర్తించి అవార్డు అందజేసిన రవీంద్ర భారతి కళావేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్న ఊరికి,కన్న తల్లికి, జాతి అభివృద్ధికి చేసిన సేవ ఎంతోవిలువనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహ, వెంకటసుబ్బయ్య, రవికృష్ణ, మోష, నరసింహ, టిడిపి నాయకులు మధు,సాయి, రవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో దొంగ నోట్ల కలకలం.. రూ.100 నకిలీ నోటు గుర్తింపు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:** నంద్యాల జిల్లాలో దొంగ నోట్ల కలకలం రేగింది. నంద్యాల పట్టణంలోని నూనెపల్లి ప్రాంతంలో రూ.100 నకిలీ నోటు గుర్తించబడిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. స్థానికుల వివరాల ప్రకారం, నూనెపల్లి ప్రాంతంలోని ఓ అంగడిలో వస్తువులు కొనుగోలు చేసిన వ్యక్తి రూ.500 నోటు ఇవ్వగా, తిరిగి ఇచ్చిన చిల్లరలో రూ.100 నోటు ఒకటి ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఆ నోటును పరిశీలించగా అది నకిలీ నోటుగా అనుమానం వ్యక్తమైంది. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు, ప్రజలు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా రూ.100 నోట్ల లావాదేవీల సమయంలో జాగ్రత్తగా పరిశీలించాలని, అనుమానాస్పద నోట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. నంద్యాల జిల్లాలో నకిలీ నోట్ల చలామణిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నగదు లావాదేవీల సమయంలో ప్రతి నోటును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచిస్తున్నారు.

# జిల్లా చెస్ విజేతలకు బహుమతులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:**
నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి రాపిడ్, బ్లిట్జ్ చెస్ పోటీల విజేతలకు ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం వైస్ చైర్మన్, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు.

రాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో తొలి స్థానం సాధించిన మామిళ్ల యుగంధర్, రాపిడ్‌లో రెండో స్థానం పొందిన సాయి రోహన్, బ్లిట్జ్‌లో రెండో స్థానం సాధించిన మారబత్తిన నీలేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నంద్యాల జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నిరంతర సాధనతో ఉన్నత విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. జూలై 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నంద్యాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నీలా ప్రసాద్, రాజా రమేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## లింక్ ఎరువులను కొనుగోలు చేయాలని

# బలవంతపెడితే కఠిన చర్యలు తప్పవు.

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు రూరల్, జూలై 01:**




రైతులు యూరియా, డీఏపీ ఎరువులతో పాటు లింక్ ఎరువులను కొనుగోలు చేయాలని బలవంతపెడితే కఠిన చర్యలు తప్పవు అని, లింక్ సేల్స్‌కు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఫెర్టిలైజర్ షాప్ డీలర్ ను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో రాజ్యలక్ష్మి పెస్టిసైడ్ & ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీ ఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించి, అనంతరం రైతులకు యూరియా, డి ఏ పి ఎరువులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి పెస్టిసైడ్ & ఫర్టిలైజర్స్ షాప్ లో యూరియా, డిఏపి కొనుగోలు చేయడానికి వచ్చిన రైతుల వివరాలను ఏపీ ఐఎంఎస్ యాప్ ద్వారా ఏ విధంగా నమోదు చేస్తున్నారని కలెక్టర్ పరిశీలించారు. వెంకటేశ్వర రెడ్డి అనే రైతు ఆధార్ కార్డు నెంబర్ ను యాప్ లో ఎంట్రీ చేసి అతనికి పొలానికి అవసరమైన 8 యూరియా బ్యాగ్ లను, 5 డిఏపి బ్యాగ్ లను కలెక్టర్ రైతుకు అందజేసారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని కలెక్టర్ విత్తన షాపు డీలర్ ను ఆదేశించారు. రైతులు తమ పంట అవసరాలకు అనుగుణంగా అవసరమైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని, యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రోత్సహించినా, బలవంతపరిచినా ఫిర్యాదు టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ను షాప్ లో డిస్ప్లే చేయాలని కలెక్టర్ షాప్ డీలర్ ను ఆదేశించారు. ఫర్టిలైజర్ షాప్ దగ్గర ఉన్న రైతులతో మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించి, ప్రకృతి వ్యవసాయం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించాలని కలెక్టర్ రైతులను కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రసాయన ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల మట్టి ఆరోగ్యం దెబ్బతింటుందని, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించాలంటే యూరియా వినియోగాన్ని క్రమంగా తగ్గించడం అవసరమని కలెక్టర్ రైతులకు సూచించారు. పంటల్లో రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అవసరమైతే ఇక్కడ ఉండే రైతులను ప్రకృతి వ్యవసాయం చేసి మంచి దిగుబడి సాధించిన రైతుల వద్దకు తీసుకొని వెళ్లి అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం.!



**--శ్రీనివాసపురం గ్రామంలో ఘనంగా బీజేపీ పార్టీ జెండా ఆవిష్కరణ.**

**--కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు.**



**ఆంధ్ర ప్రగతి గోస్పాడు జూలై 01:**
మండల పరిధిలోని యాళ్లూరు మజరా శ్రీనివాసపురం గ్రామంలో బుధవారం రాజకీయ సందడి నెలకొంది. బెక్కం నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు మధుగోపాల్ అధ్యక్షతన గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు, కర్నూలు జిల్లా బిజెపి అధ్యక్షుడు రామకృష్ణమరియు బీజేపీ నాయకులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, బహిరంగ సభను ఏర్పాటు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ ఈ సభను నిర్వహించారు.

**కేంద్ర పథకాలతోనే ప్రగతి సాధ్యం**

ఈ సభలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, తద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు వేయవచ్చని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర నిధుల ద్వారానే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందన్నారు.

**తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**

ఈ కార్యక్రమంలో కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంస, బీజేపీ నాయకులు బెక్కం నాగేశ్వారెడ్డి, రవీంద్ర, కాశెట్టి చంద్రశేఖర్, మధుగోపాల్ లతో పాటు పలువురు గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభ అనంతరం స్థానిక సమస్యలపై నాయకులు ప్రజలతో చర్చించారు.



EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న.

..లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేత.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నంద్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న బుధవారం ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. శేషన్న మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సమయానికి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి.

..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్, జూలై 01:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కోడుమూరు మండల కేంద్రంలోని తేరు బజార్ కాలనీలో పర్యటించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నమోదు పై కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడుమూరు మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ ఎంత శాతం నమోదైందని కలెక్టర్ సంబంధిత తహసీల్దార్ ని అడిగి తెలుసుకున్నారు. డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బిఎల్వో చేస్తున్న పనితీరును కలెక్టర్ పరిశీలించి ఎన్యూమరేషన్ ఫామ్ లో కుటుంబ సభ్యుల చేరికలు ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోడుమూరు మండల తహసిల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణంలో 2 సర్ హెల్ప్ డెస్క్‌లను ప్రారంభించిన ఎన్ ఎండి. ఫిరోజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 01:**



నంద్యాల పట్టణంలోని 37వ వార్డు నందమూరి నగర్, 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హెల్ప్ డెస్క్‌లను తెలుగుదేశం పార్టీ వార్డు కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, వాటిని ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి. ఫిరోజ్ హాజరై తన చేతులా మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ప్రజల గొంతుకకు విలువనిచ్చేది, మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే శక్తిని కల్పించేది ఓటేనని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో తమ పేరును నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.
అదే విధంగా నంద్యాల పట్టణ శివార్లలో పేదలు, నిరక్షరాస్యులు అధికంగా ఉండటంతో వారికి సహాయపడేందుకు తెలుగుదేశం పార్టీ వార్డు కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో వారి ఓటు నమోదు అయ్యేలా సహకారం అందిస్తున్నామని తెలిపారు. వార్డు ప్రజలందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు విద్యార్థుల మానసిక పరిణితి పెంచుతాయి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 01:**



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే మానసిక పరిణితి నీ పెంచుతాయని శ్రీ శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మెన్ సుధాకర్ పేర్కొన్నారు.
నంద్యాల క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ సి.బి.ఎస్.ఈ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు గత నెల 30 వ తారీఖున నంద్యాల శ్రీ వివేకానంద ఆడిటోరియం లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ , నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన నంద్యాల జిల్లా రాపిడ్, బ్లిట్జ్ చెస్-2026 రాష్ట్రస్థాయి సెలక్షన్స్ లో అత్యంత ప్రతిభ కనబరచి బహుమతులను కైవసం చేసుకున్నారు.
యు-15 విభాగము నందు సి.పవన్ కుమార్ రెడ్డి మొదటి బహుమతిని సాధించగా,
యు-14 విభాగము నందు ఎస్.హుస్సేన్ మొదటి బహుమతి,
యు-13 విభాగము నందు పి.జితేంద్ర రెడ్డి ప్రథమ బహుమతి, కే. సంతోష్ ద్వితీయ బహుమతి,
యు-11 విభాగమునందుజె. అభిరాం రెడ్డి, టి. రియాన్, బి. దిలీప్ గౌడ్ మరియు సి. అవంతికలు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ సుధాకర్ బహుమతులను కైవసం చేసుకున్న విద్యార్థులను మెడల్స్ తో సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడలు విద్యార్థుల మానసిక పరిణతిని పెంచుతాయని, విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమములో విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిఎం ఎఫ్ఎంఈ కింద మంజూరైన యూనిట్లను త్వరితగతిన పూర్తి చేయాలి.

..జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లను ప్రోత్సహించాలి.

..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 01:**
ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ కింద జిల్లాకు మంజూరైన యూనిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పైన అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ..నంద్యాల జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి అనుకూలమైన వసతులు ఉన్నాయని అధికారులందరూ బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకొని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి ప్రత్యేక కృషి చేయాలన్నారు.
2025- 26 సంవత్సరంలో ఇచ్చిన టార్గెట్ ను జూలై 15వ తేదీ లోపల పూర్తి చేయాలని బ్యాంకాలను కోరారు.
2026 -27 సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లాకు 50 యూనిట్లు టార్గెట్ ఇవ్వడం జరిగింది ఇందుకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించి ఈనెల చివరిలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.
ఈ పథకం కింద మెప్మా, సేర్ప్, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖలకు సంబంధించిన అధికారులందరూ లబ్ధిదారులను గుర్తించి ప్రాజెక్టులు తయారుచేసి డిఆర్పీలు, బ్యాంకర్లు సమన్వయంతో జిల్లాకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు.
నంద్యాల జిల్లాలో ఎక్కువగా చిల్లి, మిల్లెట్స్, బేకరీలకు సంబంధించిన ప్రాజెక్టులు అరటికి సంబంధించిన ప్రాజెక్టులు ఎక్కువగా వస్తున్నాయని వీటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు.
మరియు డ్రై మటన్, డ్రై ఫిష్, డి హైడ్రేటెడ్ ఆనియన్స్, డీ హైడ్రేటెడ్ వెజిటేబుల్స్, ఇలాంటి వాల్యూ కు సంబంధించిన ప్రాజెక్టులన్ని చేసేందుకు మరింత కృషి చేసి లబ్ధిదారులకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఎల్ డి ఎం, డి ఎం నాబార్డ్, జిల్లా లోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, జెడి ఫిషరీస్, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటనపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్ష.

.జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి స్థల పరిశీలన చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూలై 01:** నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేపథ్యంలో ఆర్ & బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షెరాన్‌లతో కలిసి మంత్రి బనగానపల్లెలో క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. అనంతరం సీఎం పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన భద్రత చర్యలు, ఏర్పాట్లపై బనగానపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**భారీ బహిరంగ సభకు స్థల పరిశీలన**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షెరాన్ కలిసి స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేని విధంగా స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి బనగానపల్లె నియోజకవర్గానికి రానుండటంతో భారీగా తరలివచ్చే ప్రజానీకానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష**

అనంతరం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం సభకు సంబంధించిన ప్రజా వేదిక, హెలిపాడ్ ఏర్పాటుపై చర్చించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సక్రమంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా.

జిల్లాలో జూలై మాసంలో 2,34,252 మందికి రూ.102.98 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ.

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్, జూలై 01:**
లబ్ధిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందచేస్తూ, జూలై మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 34 వేల 252 మంది లబ్ధిదారులకు రూ. 102.98 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.
బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక మహాత్మా నగర్ లోని ఇందిరమ్మ కట్ట వద్ద రాముడు, రాధమ్మ, అయ్యన్న, విజయ్ కుమార్ లకు వైకల్య పెన్షన్, మరెన్న, మునిస్వాములకు వృద్ధాప్య పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ వారితో ఆత్మీయంగా మాట్లాడుతూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ఎప్పటి నుండి వస్తుంది, వచ్చిన పెన్షన్ ను దేని కోసం వినియోగించుకుంటున్నారని కలెక్టర్ పెన్షన్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా, అని కలెక్టర్ ఆరా తీశారు. పెన్షన్ లను లబ్ధిదారులకు అందచేయడంలో తొలిరోజే 100 శాతం పెన్షన్ పంపిణీ చేయాలని, ఒకటీ, అరా మిగిలిపోతే రెండో రోజు కల్లా పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ డిఆర్డిఎ పిడి ని ఆదేశించారు..

**ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి**

స్థానిక మహాత్మా నగర్ లోని ఇందిరమ్మ కట్ట సమీపంలోని 59 పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న డిజిటైజేషన్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిఎల్ఓ ట్యాబ్ లో ఎన్యూమరేషన్ ఫార్మ్స్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ, డిజిటైజేషన్ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందని పరిశీలించారు. డిజిటైజేషన్ ప్రక్రియ బాగానే జరుగుతోందని, ఈ ప్రక్రియలో మరింత పురోగతి సాధించి త్వరితగతిన డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు , తదితరులు పాల్గొన్నారు..

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 01:**
తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, వెల్ఫేర్ హాస్టళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
బుధవారం కలెక్టరేట్లో ఆర్డబ్ల్యూఎస్, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి, ఏపీఎంఎస్ఐడిసి అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపడుతున్న కమ్యూనిటీ కాంప్లెక్స్ నిర్మాణాలను, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ఈ ఏడాది డిసెంబర్ లోపు పూర్తి చేయాలని అధికారులు ఎస్ ఈ ని ఆదేశించారు.
వేసవిలో అత్యవసర పనుల కింద మంజూరు చేసిన రూ.50 లక్షల ఖర్చుతో చేపడుతున్న 46 మరమ్మతు పనుల్లో 25 పూర్తయ్యాయని, మిగిలిన 21 పనులను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ ఈ ని ఆదేశించారు. అలాగే వెల్ఫేర్ హాస్టల్ లలో చేపడుతున్న టాయిలెట్ లు, తాగునీటి సరఫరా పనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జల్జీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులను కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
వైద్య ఆరోగ్య శాఖలో ఏపీఎంఎస్ఐడిసి ద్వారా ఆదోని ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న పనులపై సమీక్షిస్తూ, ఆదోని ప్రభుత్వాసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్, ఐపి బ్లాక్, డ్రైన్లు, రోడ్లు, ఎలక్ట్రికల్ తదితర పనుల నిమిత్తం డిఎంఎఫ్ కింద రూ. 98 లక్షల మంజూరు చేయడం జరిగిందని ఈ పనులను ఒక నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ ఈ ని ఆదేశించారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్లో చేపడుతున్న పనులపై సమీక్షించారు.
ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి ద్వారా సంక్షేమ హాస్టల్స్ లో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డీఈని ఆదేశించారు. జిల్లాలోని ఏడు బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో చేపడుతున్న టాయిలెట్ కిచెన్ మరమ్మతుల పనులకు సంబంధించి రెండు పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన ఐదు పనులను ఈనెల 15వ తేదీలోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతున్న ఇంజనీరింగ్ కాలేజ్ భవనాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎం అజయ్ కింద కంబాలపాడు, గూడూరు లో చేపడుతున్న హాస్టల్ ల పనులను కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ మనోహర్, ఏపీ ఎంఎస్ఐడిసి ఎస్ ఈ ఇందిర,ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి డి ఇ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.